అన్నార్తుల ఆకలి తీర్చే 'బ్యాంక్'

అన్నిదానాల్లో కన్నా అన్నదానం మిన్న. ఇప్పుడు ఇదే నానుడిని ఆచరిస్తూ విజయనగరం నగరపాలక సంస్థ ఫుడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేస్తోంది. తొలుత ప్రయోగాత్మకంగా నెలకొల్పిన నాలుగు ఫుడ్ బ్యాంక్‌లు విజయవంతంగా నిర్వహిస్తుండగా, మరో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నారన్న వార్త విని అందరూ హర్షిస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగరపాలక సంస్థ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై, అన్నార్తుల ఆకలి తీర్చుతున్నారు.


నగరంలో ఏర్పాటు చేస్తున్న ఐదో ఫుడ్‌బ్యాంక్ ఇదే..

- విజయనగరంలో మరో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు
- ఉచితంగా మధ్యాహ్నం భోజనం.. రాత్రికి రోటీ
- ఉగాది రోజున ప్రారంభించేందుకు సన్నాహాలు

విజయనగరం:

కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్‌లో మరో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు చకచకా జరిగిపోతున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారం దిగిపోయే ముందు అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, రూ.5కే మధ్యాహ్న భోజనం అందిస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలోని నాలుగు చోట్ల ఫుడ్‌బ్యాంక్‌లు ఏర్పాటు చేసి, ఉచితంగా ఆహారం పంపిణీ చేస్తోంది. తాజాగా మరో ఫుడ్‌బ్యాంక్‌ను ఉగాది పండగ రోజున ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడం విశేషం. నగరానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు ప్రతిరోజూ వేల సంఖ్యలో ఉంటారు. అందులో చాలామంది నిరుపేద గ్రామీణ కుటుంబాలకు చెందిన వారే ఉంటారు. వీరితో పాటు నగరంలోని నిరుపేదలకు సమయానికి ఆహారాన్ని అందించాలనే సదుద్దేశ్యంతో ఇప్పటికే స్థాపించిన ఫుడ్‌బ్యాంక్‌లు సత్ఫలితాలను ఇస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ సౌజన్యంతో నగరంలోని కోట జంక్షన్, ఎన్‌సీఎస్ థియేటర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, పోలీస్ బ్యారక్స్ దగ్గర ఇప్పటికే ఏర్పాటు చేసిన నాలుగు ఫుడ్‌బ్యాంక్‌ల ద్వారా అన్నార్తులకు ఆహారాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. ప్రతిరోజూ ఎంతోమంది అన్నార్తుల ఆకలి బాధలను ఈ ఫుడ్‌బ్యాంక్‌ల ద్వారా తీర్చడం జరుగుతోంది.

ఆంజనేయస్వామి ఆలయం నుంచి..

ఇప్పుడు కార్పొరేషన్ కార్యాలయానికి సమీపంలో ప్రకాశం పార్కు ఆనుకుని ఏర్పాటు చేస్తున్న ఫుడ్ బ్యాంక్‌లో ప్రారంభ రోజుల్లో రోజూ 100 మందికి మధ్యాహ్న భోజనం, రాత్రి రోటీలు అందించేందుకు నిర్ణయించారు. దీనికి అవసరమైన ఆహారాన్ని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి సరఫరా చేయనున్నారు. కాలక్రమంలో ఆదరణ పెరిగితే మరింత మందికి ఆహారాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దీనికోసం స్థానిక ప్రజాప్రతినిధుల నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఆహారం పంపిణీ చేసే బాధ్యతను వారే దగ్గరుండి పర్యవేక్షించనున్నారు. ఇదిలా ఉండగా, ఫుడ్‌బ్యాంక్ ఏర్పాటుకు సంబంధించి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

ఎవరైనా భాగస్వాములు కావచ్చు..

పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న ఫుడ్ బ్యాంక్‌ల ద్వారా ఆహార పంపిణీలో వివిధ స్వచ్ఛంద సంస్థలతో పాటు సాధారణ పౌరులు, ఎవరైనా భాగస్వాములు కావచ్చు. పుట్టిన రోజు వేడుకలు, పెళ్లిరోజు వేడుకలతో పాటు పలు సందర్భాల్లో మన వంతుగా ఆహారాన్ని వడ్డించి, ఫుడ్‌బ్యాంక్‌ల్లో పంపిణీ చేయవచ్చు. దీనికోసం ముందుస్తుగా ఫుడ్ బ్యాంక్ నిర్వాహకులతో సంప్రదించి, సమాచారం అందజేయాలి. నగరంలో ఏర్పాటైన నాలుగు ఫుడ్‌బ్యాంక్‌లలోనూ ఇదే ప్రక్రియ సాగుతోంది.

ప్రతిష్టాత్మకంగా అమలు..



పేదల ఆకలి తీర్చడంలో నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌బ్యాంక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనల మేరకు ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఫుడ్‌బ్యాంక్‌లు ఏర్పాటు చేసి, ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ వద్ద కొత్తగా ఐదో ఫుడ్ బ్యాంక్‌ను ప్రారంభించనున్నాం.

–ఆశపు వేణు, కో–ఆప్షన్ సభ్యుడు, విజయనగరం కార్పొరేషన్.

క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖాళీగా ఉన్న 10 అంగన్‌వాడీ కార్యకర్తలు, 53 అంగన్‌వాడీ సహాయకులు, మరో 15 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సంబంధించి, దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సాధికారత అధికారిణి బి.శాంతకుమారి ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఖచ్చితంగా పదో తరగతి ఉత్తీర్ణత పొందాలని, అలాగే తెలుగు చదవడం, రాయడం బాగా రావాలన్నారు. 01–07–2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.7 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

కుట్టుమిషన్ అందజేత


కుట్టుమిషన్ అందిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లత

గంట్యాడ: మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న కేజీబీవీ విద్యార్థులకు కుట్టుమిషన్‌తో పాటు క్రాఫ్ట్ మెటీరియల్‌ను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు లత ఆదివారం అందజేశారు. విద్యార్థుల చేతి నైపుణ్యానికి ఇవి ఉపకరిస్తాయని భావించి, వీటిని ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పార్టీ బలోపేతానికి చర్యలు

విజయనగరం గంటస్తంభం: క్షేత్రస్థాయిలో ఉత్తరాంధ్ర పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్ట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర పార్టీ కేంద్ర వర్కింగ్ కమిటీ, కోర్ కమిటీ, కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని, పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. త్వరలోనే అన్ని స్థాయిల్లో కార్యవర్గ నియామకాలు పూర్తిచేసి, తదుపరి కార్యాచరణకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో పార్టీ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఇన్‌చార్జ్‌లు కూన రామారావు, పేడాడ జనార్దనరావు, జగదీష్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన


అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట మండపం వీధిలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన ఆలాపన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలపించిన భక్తిగీతాలు శ్రోతలను అలరించాయి. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎం.భీష్మారావు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యం కావాలి


మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ

విజయనగరం పూల్‌బాగ్: మహిళలు చైతన్యవంతులు కావాలని, అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ పిలుపునిచ్చారు. స్థానిక అమర్ భవన్‌లో మద్ది మాణిక్యం అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నిర్మాణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. దీనికోసం ప్రతీ మహిళ తనకు తానుగా కృషి చేయాలన్నారు. స్వశక్తితో స్వయంఉపాధి మార్గాలు అనుసరించి, ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.కామేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని పలు లాడ్జీల్లో ఎస్‌ఐ సురేంద్రనాయుడు సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ కార్డు చూపించిన వారికే గదులు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. సైబర్ నేరగాళ్లు, బెట్టింగ్‌రాయుళ్లు, జూదర్లు వంటి వారు లాడ్జీల్లో మకాం వేసి, తమ కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉందని, అటువంటివి జరిగితే నిందితులతో పాటు లాడ్జీ యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

నూకాలమ్మ సేవలో అవనాపు విక్రమ్ దంపతులు


నూకాలమ్మను దర్శించుకుంటున్న అవనాపు విక్రమ్ దంపతులు

విజయనగరం: నగరంలోని మంగళ వీధిలో నూకాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, ఆయన సతీమణి అయిన ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్‌పర్సన్ అవనాపు భావన కలిసి అమ్మవారిని ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా నిత్యం ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించమని వేడుకున్నారు. అంతకుముందు వారికి ఆలయ నిర్వాహకులు ఆలయ సంప్రదాయం ప్రకారం సాదర స్వాగతం పలికారు. వారి పేరిట విశేష పూజలు చేశారు.

వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ప్రభుత్వం అందిస్తున్న ఆస్తి పన్ను వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో కలిసి పన్ను బకాయిదారులను కలిసి, వడ్డీ మాఫీపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు గత బకాయిలపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందన్నారు. కేవలం పన్నులు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధికి సహకరించిన వారవుతారని, అందరూ పన్నులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఆర్‌ఐ త్రినాథ్, సిబ్బంది విజయ్, రంగా తదితరులు పాల్గొన్నారు.

కూన రవి క్షమాపణలు చెప్పాలి


మాట్లాడుతున్న యాదవ సంఘం ప్రతినిధులు

విజయనగరం పూల్‌బాగ్: టీడీపీ నేత కూన రవికుమార్ క్షమాపణలు చెప్పాలని యాదవ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధు యాదవ్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఉత్తరాంధ్ర మంత్రులు గొర్రెలు కాసే వారి కన్నా హీనమని ఆయన మాట్లాడడం యాదవులను కించపరచడమేనన్నారు. ఇదే విషయమై ఆదివారం మీడియాతో మాట్లాడిన మధు యాదవ్ కూన రవి మాటలు యాదవులను బాధించాయని, అలా మాట్లాడడం ఎంతమాత్రం సరికాదన్నారు. తమ కులవృత్తిని దైవంగా భావిస్తున్నామని, అటువంటి వృత్తిపై ఆయన తప్పుడు వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమన్నారు. దీనిని యావత్తు యాదవ సంఘం ఖండిస్తోందన్నారు. యాదవులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గదుల సత్యలత యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు బి.అప్పారావు యాదవ్, జిల్లా లీగల్ కన్వీనర్ గువ్వల తిరుపతిరావు యాదవ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన శ్రావణి, కౌశిక్‌లను అభినందిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఈ బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు కోచ్ డీవీ చారి ఆధ్వర్యంలో ఆమెను నగరంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎంతోమంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించిన ఎంతోమందికి ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయ రంగంలో ఉన్నత పదవులు దక్కుతున్నాయన్నారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణేలో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఫెన్సింగ్ క్రీడాకారులకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు డిప్యూటీ స్పీకర్‌తో మాట్లాడి, తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తెలుగు సంప్రదాయ పరిరక్షణకు కృషి


మహాకవి గురజాడకు నివాళులర్పిస్తున్న కట్టమూరి చంద్రశేఖరం తదితరులు

విజయనగరం టౌన్: తెలుగు సంప్రదాయ పరిరక్షణకు సాహితీ సంస్థలు కృషి చేయాలని ప్రముఖ అవధాన పండితులు కట్టమూరి చంద్రశేఖరం పిలుపునిచ్చారు. స్థానిక గురజాడ స్వగృహంలో సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. భావితరాలకు మంచి సంప్రదాయం అందించాలని కోరారు. అనంతరం ఉగాది సందర్భంగా నిర్వహించిన కవితలు, వ్యాసాలు, పాటలు, పద్య పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం మహాకవి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. గురజాడ మునిమనవడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రచయిత్రులు చివుకల శ్రీలక్ష్మి, మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకాంతి, సంస్థ ప్రతినిధులు రామ్‌కుమార్, శేఖర్, గురజాడ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీకి ఏర్పాట్లు

రామభద్రపురం: జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనంలో వారానికి మూడు రోజుల పాటు రాగిజావ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21వ తేదీన స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లను డీఈఓ లింగేశ్వరరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆరోజు విద్యార్థులతో వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ఇంట రాక్ట్ అవుతారు. దీనికోసం పెద్దస్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శానిటేషన్ డ్రైవ్

రాజాం: పట్టణంలో మూడురోజుల పాటు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివా రం ఆయన పర్యటించారు. వర్షాల కారణంగా డ్రైనేజీల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య కార్మికులను బృందాలుగా ఏర్పాటు చేసి మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలి



మల్లు స్వరాజ్యం, నంబూద్రిపాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం, సీపీఎం నేత వి.ఎం.ఎస్ నంబూద్రిపాద్‌ల వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నంబూద్రిపాద్ సీపీఎం అఖిల భారత కార్యదర్శిగా అనేక ప్రజాపోరాటాల్లో పాల్గొన్నారని, పార్టీ అభివృద్ధి, ప్రజల మంచి కోసం తన జీవితాన్నే దారబోశారని కొనియాడారు. స్త్రీ విముక్తి కోసం తుపాకీ పట్టిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని, నైజాం సర్కారుకి వ్యతిరేకంగా పోరాడిన సాకలి ఐలమ్మ సమ ఉద్యమరాలు ఆమె అని కీర్తించారు. వారిద్దరూ ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపించిన నేతలు అని, దీనికోసం ఉద్యమబాట పట్టి, అనేక త్యాగాలు చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి, పి.రమణమ్మ, జి.శ్రీను, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పూల్‌బాగ్: నగరంలోని 45వ డివిజన్ పరిధిలో ఉన్న కనపాకలో సీపీఎం నాయకురాలు, కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మాట్లాడుతూ ఐద్వా అభివృద్ధి, మహిళల హక్కులు, రక్షణ, మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడిన గొప్ప పోరాటయోధురాలు స్వరాజ్యమని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు వర్షం దెబ్బ


అన్నంరాజుపేటలో మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు చాలా పంటలు దెబ్బతిన్నాయి. జామి, రాజాం, సంతకవిటి, గరివిడి, చీపురుపల్లి, వంగర మండలాల్లోని మొత్తం 45 గ్రామాల్లో ఈదురుగాలులతో పాటు పడిన వర్షానికి 869 ఎకరాల్లోని మొక్కజొన్న నేలకొరిగింది. దీంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, జామి మండలంలో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు ఆదివారం పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. త్వరలోనే పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.

పోలీసుల అదుపులో అంగన్‌వాడీ కార్యకర్తలు


రైల్వేస్టేషన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ జయంతి

బాడంగి: రాష్ట్ర అంగన్‌వాడీ యూనియన్ పిలుపు మేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను మండలంలోని డొంకినివలస రైల్వేస్టేషన్‌లో ఎస్‌ఐ జయంతి తన సిబ్బందితో కలిసి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పలు డిమాండ్ల సాధన కోసం అమరావతికి వెళ్లి, వారు ఆందోళన చేయనున్నట్లు తెలుసుకున్న పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు వారిని అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నట్లు సమాచారం.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులతో విజేతలు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష విజేతలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ మినిస్ట్రీల్ హాల్‌లో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన సీనియర్ ఇంజినీర్ శివానంద్, జేవీవీ నాయకులు రమణ ప్రభాత్ మాట్లాడుతూ ఏటా ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టేందుకు ఈ ప్రజ్ఞా వికాస్ పరీక్షలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలో విజేతలకు అభినందనలన్నారు. జిల్లాలో 96 మార్కులతో మొదటి స్థానంలో పొగిరి శ్యామల(రాజాం) నిలవగా, 95 మార్కులతో జయేంద్ర నాయుడు(విజయనగరం) రెండో స్థానం, లావణ్య(గంట్యాడ), దిలీప్(నెల్లిమర్ల) మూడో స్థానంలో నిలిచి, నగదు బహుమతి కైవసం చేసుకున్నారు. వీరికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు మెమొంటో కూడా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, డి.రాము, సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనజీవామృతంతో పంటలకు మేలు


గొర్లెసీతారాంపురంలో ఘనజీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి సేద్యం ప్రతినిధులు సత్యవతి, శ్రీరాములు, అనిత

బొబ్బిలి రూరల్: ఘనజీవామృతంతో పంటలకు మేలు కలుగుతుందని ప్రకృతిసేద్యం ప్రతినిధులు జి.సత్యవతి, జి.శ్రీరాములు, జి.అనిత అన్నారు. ఆదివారం మండలంలోని గొర్లెసీతారాంపురం, జగన్నాథపురం గ్రామాల్లోని రైతులకు ఘనజీవామృతం తయారీ, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు తొలుత ఆవుపేడ, ఆవుమూత్రం, బెల్లం, పప్పుదినుసుల పిండితో ఘనజీవామృతాన్ని ప్రయోగపూర్వకంగా తయారు చేసి, వివరించారు. అనంతరం దానిని పంటలకు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఇది చల్లడం ద్వారా పంటలకు ఎటువంటి చీడపీడలు, వ్యాధులు సోకవన్నారు. ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు అధిక దిగుబడులు కూడా వస్తాయని తెలిపారు.

వేసవి దుక్కులతో మేలు


రామభద్రపురంలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు

రామభద్రపురం: వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే సాగు సమయంలో కలుపు బెడద అధికంగా ఉంటుంది. కలుపు మొక్కలు భూమిలోని నీరు, పోషక పదార్థాలను గ్రహించి పెరుగుతాయి. దీంతో భూమి లోపలి పొరల్లో నీరు హరించుకుపోయి భూసారం తగ్గుతుంది. ఈ క్రమంలో రైతు వేసిన పోషకాలు కూడా లభించవు. దుక్కిలో బయటపడిన పురుగులను సైతం పక్షులు తినడం వల్ల చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. మరింత లోతుగా దుక్కి చేసినట్లయితే పంటలకు చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. ఈ నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు చేసుకోవడం మేలు అని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. శనివారం వర్షం కురవడం వల్ల వ్యవసాయ పనులు చేసేందుకు పదును ఉండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.